

నేడు కడపకు శాప్ చైర్మన్ రాక

ప్రజాశక్తి-కడప

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు ఈ నెల 7వ తేదీన కడపకు రానున్నారు. ఏడవ తేదీన ఉదయం 8 గంటలకు తిరుపతి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 11 గంటలకు కడప జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియానికి చేరుకుంటారు. అనంతరం 11.30 గంటల నుండి అన్ని క్రీడా సంఘాలతోను, పిఇటిలతోనూ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్థానిక రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించి అక్కడ మైదానాలను, స్పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్పోర్ట్స్ స్కూల్లో విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్పోర్ట్స్ స్కూల్ సిబ్బందితోనూ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు.

ఎస్‌పి హర్షవర్ధన్‌రాజుపై బదిలీ వేటు

- వైసిపి నేత రవీంద్రారెడ్డి పరార్ ఘటనలో చర్యలు
- చిన్నచౌక్ సిఐ సస్పెన్షన్
- ఘటనపై సిఎం చంద్రబాబు, డిజిపి సీరియస్
- కడపలో డిఐజి కోయ ప్రవీణ్ మకాం
- అన్నమయ్య జిల్లా ఎస్‌పికి అదనపు బాధ్యతలు అప్పగింత



మాజీ సిఎం జగన్‌తో రవీంద్రారెడ్డి (ఫైల్ ఫోటో)



ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. వివరాలలోకి వెళితే...మంగళవారం రాత్రి పులివెందుల పోలీసులు సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారనే ఫిర్యాదులపై నిందితుడిని అదుపులోకి తీసుకుని కడపకు తరలించారు. తెల్లవారుజామున 41(ఎ) నోటీసులిచ్చి వదిలేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. కొన్నేళ్ల కిందటి నుంచి వైసిపి తరుపున సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత, విద్యా శాఖ మంత్రి లోకేష్, వైఎస్.విజయమ్మ, వైఎస్.సునీత, తదితర ప్రముఖులపై అనుచిత పోస్టులు పెట్టారనే ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే రవీంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని నోటీసులిచ్చి విడుదల చేశారు. వారం రోజుల నుంచి అనుచిత పోస్టుల వెల్లువెత్తాయనే ఆరోపణతో తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకుని కడపకు తరలించారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి ప్రమేయంతో పోలీసులు 41(ఎ) నోటీసులు ఇచ్చి బుధవారం తెల్లవారుజామున పంపించారు. అప్పటికే అన్నమయ్య జిల్లా రాజంపేట పోలీసులు మరొక కేసు కింద అరెస్టు చేయడానికి వచ్చినప్పటికీ గుట్టుచప్పుడు గాకుండా విడుదల చేయడం ఏమిటనే అంశం చర్చనీయాంశంగా మారింది. నిందితుడిపై కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, హైదరాబాద్, మంగళగిరి, తదితర ప్రాంతాల్లో సుమారు 30కిపైగా కేసులు ఉన్నప్పటికీ 41(ఎ) నోటీసులిచ్చి విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వర్రా రవీంద్రారెడ్డి కోసం కడప ఎస్పీ కార్యాలయం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేములలో వర్రా రవీంద్రారెడ్డి స్నేహితుడు మహేశ్వర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. బుధవారం ఉదయమే కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ కడపలో మకాంవేసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో రవీంద్రారెడ్డి అరెస్ట్, విడుదల, పరారీ తదితర అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి కనుసైగల్లో పోలీసులు నడుస్తున్న వ్యవహారం చర్చకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పనితీరుపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వర్రా రవీంద్రారెడ్డి వ్యవహారంపై సీరియస్ అయిన ప్రభుత్వం కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజును బదిలీ చేయడంతోపాటు చిన్నచౌక్ సిఐ తేజోమూర్తిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎస్పి హర్షవర్ధన్‌రాజును హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కడప జిల్లా ఎస్‌పిగా అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడుకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

'ఉక్కు'ను ఏర్పాటు చేసే వరకూ పోరాడుతాం : సిపిఎం



పట్టణ మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కరువు సీమ రాయలసీమకు వెలుగు నింపాల్సిన కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రశ్నించారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో బుధవారం సిపిఎం పట్టణ 3వ మహాసభ ముంతాజ్‌బేగం, పక్కీరయ్య అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనుబడిన రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడప జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన సెయిల్ ఆధ్వర్యంలో భారీ సమగ్ర ఉక్కు పరిశ్రమను నిర్మించి ప్రత్యక్షంగా పరోక్షంగా ఒక లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. రాయలసీమలోని కరువులు వలసలు నివారించాలని పార్లమెంట్ రాష్ట్రపతి ఆమోదంతో చట్టంలోని 13వ షెడ్యూల్‌లో పొందుపరచినప్పటికీ అమలు చేయకుండ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాటివేస్తూ మాయమాటలు చెబుతూ వస్తున్నాయని విమర్శించారు. సిఎం చంద్రబాబు గతంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని టిడిపి ఎంపీ సీట్లపై ఆదారపడి ఉందని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కడప-బెంగుళూరు రైల్వేలైన్ 20 ఏళ్లుగా 20 కి.మీలు మాత్రమే పూర్తి చేశారని మిగతా రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని తెలుగుగంగ, గాలేరు-నగిరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టల పరిధిలోని రిజర్వాయర్ల పంట కాలువలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. కడప జిల్లాలో కరువు మండలాలు ప్రభుత్వం ప్రకటించకపోవడం వ్యవసాయాధికారుల నిర్లక్ష్యమే కారణంగా భావించాలన్నారు. మహాసభల ప్రారంభానికి ముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు పక్కీరయ్య జెండా ఆవిష్కరణ చేశారు. మహాసభల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, ప్రొద్దుటూరు పట్టణ కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాసమస్యలే అజెండాగ భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు నిర్వహించాలని అనేక తీర్మానాలు మహాసభల్లో స్థానిక నాయకత్వం ప్రవేశపెట్టి మహాసభ ఆమోదించింది.

నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం రైల్వేలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప రైల్వే డిప్యూటీ స్టేషన్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి భారతదేశంలో ఉన్నప్పటికీ ఉపాధి కల్పనలో బిజెపి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి యువతకు ఉపాధిని దూరం చేస్తుందని తెలిపారు. ఫలితంగా భారతదేశాన్ని నిరుద్యోగ భారతంగా మారుస్తుందని చెప్పారు. తక్షణమే రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకునే ఆలోచనను వెనక్కి తీసుకుని రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రోజువారీగా సాధారణంగా వచ్చే జబ్బుల మందులపై విపరీతంగా రేట్లు పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో కడప నగర కన్వీనర్ విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అంజి, నగర నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం : వైవీయూ విసి



రక్తదాన శిబిరాన్ని ప్రాంభిస్తున్న కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం, ఇండి యన్ రెడ్ క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి విస్తృత స్పందన లభించింది. బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని డిఒఎ కార్యాలయంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ప్రారంభించారు. కార్యక్రమంలో వైవీయూ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేష్, రెడ్ క్రాస్ సంస్థ వైద్యాధికారి డాక్టర్‌యశస్వి రెడ్డి, ఎన్ఎస్ఎస్‌పిఒలు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత డాక్టర్ శ్రీధం రెడ్డి, డాక్టర్ గంగయ్య, ఆచార్య విజయభారతి, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ స్పెషలాఫీసర్ శివ శంకర్‌రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక శాస్త్రంలో ఈశ్వరరెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర శాఖ పరిశోధకులు జి.ఈశ్వరరెడ్డికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆర్థిక శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ తుమ్మలూరు సందర్శనరెడ్డి పర్యవేక్షణలో అగ్రికల్చర్ ట్రాన్స్ ఫర్మేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఎ కేస్ ఆఫ్ రాయలసీమ రీజియన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు ప్రకటించారు. ఈశ్వరరెడ్డి రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్స్లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పొందిన ఈయనను వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, ఆర్థిక శాస్త్ర శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, మిత్రులు అభినందించారు.

చెరువు ఆయకట్టు భూములకు నీరు విడుదల

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని కొప్పోలి చెరువు ఆయకట్ట భూములకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి బుధవారం నీరు విడుదల చేశారు. ఎగువన కురిసిన వర్షాలకు కొప్పోలి చెరువు నిండడంతో నీరు వదిలారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ చెరువు నీటిని ప్రతి ఒక్క రైతు చదివినిగం చేసుకోవాలన్నారు. రైతులు బాగుంటే ప్రభుత్వం బాగుంటుందన్నారు. రైతుల సమస్యలు ఏమన్నా ఉన్న తమ వద్దకు తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నాగేశ్వరెడ్డి, జనసేన కమలాపురం ఇన్‌ఛార్జి వేణుగోపాల్‌రెడ్డి, జె.సుబ్బారెడ్డి, ఓబుల్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుబ్బయ్య, శ్రీనివాసులురెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురిచేయడం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్ : వివిధ రకాల శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ శిక్షించడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు అన్నారు. బుధవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ అనేక రకాలైన యాపుల ద్వారా బోధనేతర పనులు అప్పగిస్తూ జిఒ నంబర్ 117ను అమలుపరిచి ప్రభుత్వ విద్యారంగాన్ని పతనం వైపు తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన బాట పట్టి తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆచరణలో గత ప్రభుత్వ పోకడలే అనుసరిస్తూ ముందుకు వెళుతున్నదని చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆపార్ ఐడిలు సృష్టించమని ఒక వైపు ఒత్తిడి తీసుకు వేస్తూనే, ఆధార్ అప్డేషన్ చేయించమని, పదవ తరగతి విద్యార్థులకు నామినల్ రోల్స్ తయారు చేయమని, ఎఫ్ఎ2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించమని, ఈ నెల 14న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరపాలని, పూటకొక మారు ఆపార్ అప్డేషన్ తెలుపమనడం, రోజుకొక్కసారి వెబెక్స్ మీటింగులు జరుపుతూ ఒత్తిడికి గురి చేయడం సబబు కాదన్నారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శి రమణ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించడం నైపుణ్యాభివృద్ధికి దారులు

ప్రజాశక్తి-కడప అర్బన్

సవాళ్లను అధిగమించడం, అవకాశాలను స్వీకరించడం నైపుణ్యాభివృద్ధికి దారులని టిసిఎస్ రీజినల్ హెడ్ రిచర్డ్ కింగ్ అన్నారు. బుధవారం కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 'రెడినేస్ టు ఇండస్ట్రీ ఎక్స్పోజర్ సెమినార్' 3 సంవత్సరం బిటెక్ విద్యార్థులకు నిర్వచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం నిరంతరం మారుతూనే ఉందని తెలిపారు. ఈ మార్పులు వ్యాపారాలు, వ్యక్తులు, సంస్థలకి అనేక సవాళ్లను కలిగిస్తాయన్నారు. యువతకు కావల్సిన నైపుణ్య శక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కందుల మదన మోహన్‌రెడ్డి, కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టివిన్ ప్రసాద్, సీనియర్ ప్లేసెమెంట్ ఆఫీసర్ ఆర్.నాగరాజు, ప్లేసెమెంట్ కో-ఆర్డినేటర్ సిద్ధిక్, వివిధ డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు
- కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పణ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దుల రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2023- 24 సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు రూ.3,480 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. జిఒ నంబర్ 77 రద్దుచేసి పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించే విధంగా చేయాలన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో విద్యార్థుల సమస్యలను అధికారం వచ్చిన 100 రోజుల్లోనే పరిష్కారం చేస్తామని, జిఒ నంబర్ 77రద్దు చేస్తామని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 150 రోజులు అవుతున్న కనీసం ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేవని చెప్పారు. ప్రతిసారి క్యాబినెట్ సమావేశాలు నిర్వహిస్తామని చెబుతూ ఈ సమస్యల పైన స్పష్టత ఇస్తామని చెప్తున్నారు తప్ప సరి అయిన హామీ కానీ, స్పష్టత ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. జిల్లాలోని వసతి గృహాలలో ఎన్నో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆందోళన చేసిన ఎటువంటి పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల సొంత భవనాలు లేకపోవడం బాధాకరమైన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న చలో కలెక్టరేట్ ఉద్యమాన్ని గమనంలో పెట్టుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో చలో అసెంబ్లీలో భాగంగా ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి అజయ్, కమిటీ సభ్యులు అభినయ్, పట్టణ, మండల నాయకులు సురేష్, జెర్మియా, చక్రవర్తి, గిరి, జయంత్, ఈశ్వంత్ పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో, ప్రజల అభిమానంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని నూతన కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన తన ఛాంబర్‌లో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ వైఎస్ఆర్ జిల్లా ముఖ్య పాలనా అధికారిగా పదవీ బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో అక్షరాస్యతను పెంచడం, పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పనఅనే మూడు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తామన్నారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సహకారంతో కలెక్టర్‌గా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా కృషి చేస్తామని తెలిపారు. ముందుగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇన్‌ఛార్జి డిఆర్ఓ శ్రీనివాసులు, ఆర్‌డిఒలు కలెక్టర్ మొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని సెక్షన్ అధికారులు, సిబ్బంది, ప్రముఖులు, తదితరులు కలెక్టర్‌కు పుష్ప గుచ్చాలు, పూల మొక్కలు అందజేసి తమ అభినందనలు తెలియజేశారు.

అన్ని విభాగాలను పరిశీలించిన కలెక్టర్ : నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్, ఎన్ఐసి సెంటర్, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, పిజిఆర్ఎస్ హాలు, బోర్డు మీటింగ్ హాల్, విసి హాల్‌తో పాటు అన్ని సెక్షన్లకు చెందిన కార్యాలయాలను కలెక్టర్ జెసి అదితి సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు.

పరిశోధనలపై అవగాహన అవసరం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప

జీవశాస్త్రంలో జరుగుతున్న పరిశోధనల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. కళాశాల జంతు శాస్త్ర ఆధ్వర్యంలో ఆధునిక జీవశాస్త్రంపై బుధవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవశాస్త్రంలో జరుగుతున్న పరిశోధనల గురించి, వాటి వలన సమాజంలో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మాట్లాడుతూ ఆధునిక జీవశాస్త్ర పరిశోధనల వల్ల మానవుల్లో వచ్చేటువంటి వ్యాధులను త్వరగా న్యాయం చేయడానికి వీలవుతుందని తెలిపారు. ప్రొఫెసర్ సత్యవేలు రెడ్డి మధుమేహ వ్యాధిగ్రస్తుల యొక్క కాలేయంలో సంభవించే మార్పులు వాటి యొక్క నివారణ సంబంధించిన మార్గాలు తెలి పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.విశ్వేశ్వరరావు, మలేషియా యూని వర్సిటీ ప్రతినిధి డాక్టర్ నోరిజా, డాక్టర్ ఎం.భరణిధరన్, డాక్టర్ మన్సూర్ ఇస్మాయిల్ షేక్, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ డి.వీర నాగేంద్ర కుమార్, డాక్టర్ రమేష్, జువాలజీ డిపార్ట్మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.రవి శేఖర్, డాక్టర్ నీలయ్య, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ జమాల్ బాష,డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సావిత్రి, మహేష్, అపర్ణ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాతీయ సదస్సు పోస్టర్‌ను ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విభాగాధిపతి పొట్లూరు బయపురెడ్డి సారద్యంలో డిబిటి స్టార్ కళాశాల హోదాలో భాగంగా "సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం అధునాతన మెటీరియల్స్ సంశ్లేషణపై జాతీయ కాన్ఫరెన్స్" అనే అంశం మీద జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు కన్వీనర్‌గా డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ సి.నాగేశ్వర రాజు, పొట్లూరు బయపురెడ్డి, కో-కన్వీనర్‌గా డాక్టర్ కె.ఎ.జమాల్‌బాష వ్యవహరిస్తారని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఆర్‌డికి ఎపిఎన్‌జిఒ నాయకులు విజ్ఞప్తి

ప్రజాశక్తి-కడప అర్బన్

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంగల్‌రెడ్డి రాష్ట్ర సహాధ్యక్షులు వి.దస్తగిరిరెడ్డి కోరారు. బుధవారం ఆర్‌డి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీశ డాక్టర్ బి.రామ గిడ్డయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సమస్యలు, నర్సింగ్ సూపరింటెండెంట్, ఫార్మసిస్ట్, అన్ని పదహెూన్నతలు త్వరగా ఇవ్వాలని నాయకులు కోరారు. ఆర్‌డి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, బాల పుల్లయ్య, నిత్య పూజయ్య, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, పద్మనాభం, రామ సుబ్బారెడ్డి, ఖాసన్న, జిల్లా మహిళా నాయకులు గౌరీ, జ్యోతి, పద్మజీ, వెంకట లక్ష్మి, ప్రమీల రాణి, కుస్మ కుమారి, లలిత, కర్నూలు ఫార్మసీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



ఆర్‌డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ఎమ్మెల్యేచే టిడిపి ఎన్ఆర్ఐ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలబడి తనవంతుగా సేవలు అందించేందుకు టిడిపి ఎన్ఆర్ఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని టిడిపి ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డ్ సమీపంలో టిడిపి ఎన్ఆర్ఐ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి అనేక మంది బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఉన్నారన్నారు. వారు ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి స్వదేశానికి వచ్చిపోతూ తమ కుటుంబ సభ్యులను పోషించుకుంటున్నారన్నారు. చాలామంది అక్కడి పరిస్థితుల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అటువంటి వారి సహాయార్థం ఈ కార్యాలయం ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు క్రిసెంట్ జిలానీబాష, గోవర్ధన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ, 26వ డివిజన్ ఇంచార్జ్ చావాలముడి శంకర్, నాయకులు జయకుమార్, వెంకటేష్, నరసింహ, అమ్మనులా, సుజ్జత్, ఆనందరావు,విశ్వనాథ్, ఇర్ఫాన్, బక్కచిన్న, ప్రతాప్, జెకె యూత్ ఖాదర్ బాషా, మహిళా నాయకురాలు మౌనిక, సునీత, ప్రవతి పాల్గొన్నారు.

ఎపిఎస్ఆర్‌టిసి ఈడిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్



ఎపిఎస్ఆర్‌టిసి కడప జోన్ ఈడిగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఈడిగా ఉన్న చెంగల్‌రెడ్డిని విజయవాడకు బదిలీ అయ్యారు. అక్కడ ఈడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ కడపకు బదిలీపై వచ్చారు. డిపో మేనేజర్‌గా 10 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాలలో పనిచేశారు. 2017లో ఆర్యంగా కర్నూల్‌లో పనిచేశారు. 2020లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. హెడ్ ఆఫీస్‌లో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పని చేశారు. 2024లో ఎపిఎస్ఆర్‌టిసి ఈడిగా పదోన్నతి పొంది ప్రధాన కార్యాలయంలో పనిచేస్తూ కడపకు బదిలీపై వచ్చారు. అధికారుల సహకారంతో ముందుకు వెళతానని మీడియాకు తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద జోన్ కడప అని, ఈ జోన్ పరిధిలో ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి ఉన్నారని చెప్పారు. ఎక్కువగా అంతర్రాష్ట్ర సర్వీసులు చెన్నై బెంగళూరు హైదరాబాద్ ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న సిఎం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్ : గత ప్రభుత్వ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి ఆర్థిక ఇబ్బందులు కలిగించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని అధికమిస్తూ రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చెప్పారు. బుధవారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ సొంత జిల్లాలో అన్ని స్థానాలు గెలిచి, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులచే విమర్శిం పబడుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కావాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి పాలనలో జిల్లా అభివృద్ధి చెందలేదని, వైసిపి నాయకులే ఒప్పుకున్నారని చెప్పారు. జిల్లా అభివృద్ధి గురించి తెలియాలంటే డీఆర్సీ సమావేశానికి రావాలని, ఎందుకు ఎంపీ అవినాష్‌రెడ్డి రాలేక పోయారని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి, యువతకు ఉపాధి కల్పించే దిశగా మంత్రి నారా లోకేష్ ఇతర దేశాల ప్రముఖులతో చర్చిస్తున్నారని, చర్చలు సఫలీకృతం అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రాగానే, ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ పెంచి ఖచ్చితంగా ఒకటో తేదీనే పెన్షన్ దారులకు ఇంటి వద్దనే అందిస్తున్నామని తెలిపారు. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ మహిళలు అందుకున్నారని, త్వరలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యంతో పాటు, రూ.1500 ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చి రాగానే, నవరత్నాలు పథకాలన్నీ ఒకేసారి అమలు చేశారా అని నిలదీశారు. అధికారంలోకి వచ్చి ఓటమిపాలై, తిరిగి అధికారంలోకి రావాలని వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, వీరిని ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. సమర్థవంతమైన పాలన సాగిస్తున్న చంద్రబాబును ప్రజలు దీవించాలన్నారు.



కార్నియాలను అందిస్తున్న తిరుపాల్ శెట్టి కుటుంబ సభ్యులు

నేత్రదానంతో చూపు సజీవం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో చూపు సజీవంగా ఉంటుందని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు అన్నారు. స్థానిక బాకరాపురం వీధిలోని తల్లం తిరుపాలు శెట్టి మరణించడంతో ఆయన భార్య భ్రమరాంబ, కుమారుడు పవన్‌కుమార్, కోడలు లక్ష్మీ ప్రసన్న అతని నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రాజుకు సమాచారం ఇవ్వడంతో.. టెక్నీషియన్ హరీష్ మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం నేత్రాలు మట్టి పాలుకాకుండా అంధత్వంతో బాధ పడుతున్న అంధులకు దానం చేయాలన్నారు. అలా చేయడం వల్ల అంధుల జీవితాల్లో వెలుగులు నింపినవారమవుతామన్నారు. నేత్రదానం చేయదలచిన వారు 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలన్నారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు కాంబోజి మహేష్, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతలు తెలిపారు.



మహేష్‌తో మాట్లాడుతున్న ఎస్.రఘురామిరెడ్డి

వైసిపి కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న వైసిపి కార్యకర్త ఏపీ మహేష్‌ను మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. సీనియర్ వైసిపి నాయకుడు దండు రామయ్యను పరామర్శించి ఆరోగ్య, క్షేమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్య ఉంటే పార్టీ అండగా ఉంటుదని ఆయన భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు లింగన్న, మైదుకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, భరత్‌రెడ్డి, శ్రీలక్ష్మీ మాధవ ఆంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు, వైసిపి కౌన్సిలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, వెంటనే కరువు మండలాలను ప్రకటించి వారిని ఆదుకోవాలని వైసిపి నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కోరారు. స్వగ్రామం దుంపలగట్టులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా తీసుకొని వర్షపాతం నమోదును బట్టి కరువు మండలాలను ప్రకటిస్తున్నారని, ఇది రైతులకు తీవ్రమైన నష్టమన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా పరిగణలోకి తీసుకొని పంటల బీమాను వర్తింపజేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియంను గతంలో వైసిపి ప్రభుత్వం రైతుల పక్షాన చెల్లించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌లో ఫసల్ బీమాకు నగదు చెల్లించలేదని, రైతులే చెల్లించాలని ఆదేశించడం రైతులను వంచించడమేనని ఆయన విమర్శించారు. నాడు జగన్ ప్రభుత్వంలో వైఎస్ఆర్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందుతుండేదని తెలిపారు. నేడు రబీ సీజన్ మొదలైనా ఆ ఊసే లేదన్నారు. తక్షణం రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తమకు ఉద్యోగ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు సత్వరమే కల్పించాలని 104 ఉద్యోగుల కన్వీనర్ ఎ.ఉదయ్ కోరారు. ఆ మేరకు బుధవారం ఆయన స్థానిక మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 16ఏళ్లుగా 104లో పనిచేస్తున్నామని, ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. అరబిందో యాజమాన్యంతో చర్చించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో ప్రభుత్వ అధీనంలో పని చేస్తున్న తమను వైసిపి ప్రభుత్వం అరబిందో యాజమాన్యానికి అప్పగించిందన్నారు. ఈ నాలుగున్నర సంవత్సర కాలంలో డ్రైవర్, డిఈఓలుగా తాము చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటి నుంచి 14 రోజులు నిరసన కార్యక్రమాలు చేస్తూంటామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన వివరించారు.



డాక్టర్ మహాలక్ష్మికి వినతిపత్రాలిస్తున్న ఎ.ఉదయ్

రోడ్ల విస్తరణకు అనుమతి ఇవ్వండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ అవినాష్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



కడప-ముద్దనూరు రోడ్ల విస్తరణకు అనుమతి ఇవ్వాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి లేఖ రాశారు. 2024-25 వార్షిక ప్రణాళిక కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌హెచ్-716 లోని కడప-ముద్దనూరు రీచ్ మధ్య ప్రస్తుతం ఉన్న 2 లేన్ల రహదారిని వెడల్పు, బలోపేతం చేయడానికి అనుమతినివ్వాలని కోరారు. రేణిగుంట-ముద్దనూరు రోడ్డు (ఎన్‌హెచ్-716) అత్యంత ముఖ్యమైన జాతీయ రహదారి. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైల్వేకోడూరు, రాజంపేట, కడప, కమలాపురం, యర్రగుంట్ల, చిలమకూరు, ముద్దనూరు తదితర ముఖ్యమైన పారిశ్రామిక, వాణిజ్య పట్టణాల గుండా వెళుతుందన్నారు. అంతేకాక కడప స్లాబ్ పరిశ్రమలు, భారతి, జువారి, ఐసిఎల్ వంటి ముఖ్యమైన సిమెంట్ పరిశ్రమలు, రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ యర్రగుంట్ల, ముద్దనూరు పట్టణాల చుట్టు పక్కల ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న 2 లేన్ల రహదారిపై ట్రాఫిక్ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దీంతోపాటు వాణిజ్య వాహనాలు ఈ రహదారిపై పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయి. వాణిజ్య వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన పరిశ్రమలు ఉన్న ప్రాంతంతోపాటు భౌగోళిక ప్రాముఖ్యతను, ట్రాఫిక్ భద్రత దృష్ట్యా కడప, ముద్దనూరు పట్టణాల్లో ప్రాధాన్య క్రమంలో నాలుగు వరుసల రహదారిని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీంతో పై మార్గాన్ని 4 లేన్లుగా అభివృద్ధి చేయడం వల్ల టోల్ ద్వారా నెలకు దాదాపు రూ.3కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుందన్నారు. పై పనులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను విజయవాడలోని ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఆర్అండ్‌బీ)కు ఇటీవల 2024-25 వార్షిక ప్రణాళిక కింద ఆమోదం కోసం న్యూఢిల్లీలోని ఎంఓఆర్టీ అండ్ హెచ్‌కు సమర్పించినట్లు ఎంపీ తెలిపారు. ఈ విషయంలో సత్వరమే సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూటమి పాలనలో బాదుడు.. కూతలే..!

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూతల, బాదుడు ప్రభుత్వంగా తయారైందని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పని నాస్తి- ప్రచారం జాస్తి, పావు కోడిక..? ముప్పావు మసాలా అన్నట్లుంది రాష్ట్ర ప్రభుత్వ తీరు అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిందన్నారు. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పారన్నారు. చిన్నారులు, మహిళల మీద ఎక్కువగా అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన శాఖ నిర్వహణలో విఫలం చెందారని చెప్పారు. పంచాయితీల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. పలు వ్యాధులతో రాష్ట్రం అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తయారైందని పేర్కొన్నారు. ఏనుగుల దాడితో రైతులు, ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని చెప్పారు. పవన్‌కల్యాణ్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలతోపాటు పిట్టల దొర ప్రసంగాలేనని విమర్శించారు. అన్ని మంత్రిత్వ శాఖల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కరెంటు ఛార్జీల బాదుడుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు చెప్పారు. ఇంటింటా సౌభాగ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని తులసిరెడ్డి తెలిపారు.



గ్రామాలను పరిశీలిస్తున్న ఇఇ వెంకటరామయ్య

లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలంలోని పలు గ్రామాలకు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జిల్లా నీటి పారుదల శాఖ ఇఇ వెంకట రామయ్య తెలిపారు. బుధవారం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు ఆయన పలు గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గంగాదేవిపల్లి, మంగపట్నం, చింతకుంట, బడుగువారిపల్లి, బొందలకుంట చెరువులు, కుంటల్లో నీరు నింపేందుకు ప్రణాళికలు తయారు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర రెడ్డి, రామాంజనేయరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, చిరంజీవి, శివశంకర్ రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.



చట్టాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న అధికారులు

బాల్య వివాహాలు చట్టారీత్యా నేరం

ప్రజాశక్తి - ఖాజీపేట

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం.. ఇలాంటి చర్యలకు పాల్పడితే శిక్షార్హులు అవుతారని జిల్లా బాలల పరిరక్షణ విభాగ సోషల్ వర్కర్ విజయ కుమారి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బాల కార్మికుల నిర్మూలన, వీధి బాలల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1089, స్మార్ట్ ఫోన్ వల్ల ఎదురయ్యే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం మహిళా పోలీస్ అధికారి తవ్వా లీలావతి చట్టాలు, ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ అధికారి సౌజన్య బాలల హక్కులను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక పెన్నా నగర్‌లో ఉన్న ఇటుకల కర్మాగారాలు, బీరువాలు తయారు చేయు కర్మాగారాల్లో బాల కార్మికులను గుర్తించుటకు అధికారులు బాల కార్మిక డ్రైవ్ చేపట్టారు. అక్కడ పని చేస్తున్న సిబ్బందికి మిషన్ వాత్సల్య పథకం అందిస్తున్న సేవలు, చదువు ప్రాముఖ్యత గురించి జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.సునీత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది సౌజన్య, భగీరథి, తులసి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

విద్యార్థుల అవసరం మేరకు ముద్దనూరులో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బుధవారం ఎంఇఒలు నాగేశ్వర నాయక్, సుబ్బా రావు ఎంపిడిఒ ముకుందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉన్నతాదికారుల అనుమతితో తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న నీరజారెడ్డి

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని సిఎన్‌ఎఫ్ ప్రాజెక్ట్ డిపిపి నీరజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లె పరిధిలోని రైతు శాస్త్రవేత్త అజిత కుమారి వ్యవసాయ పొలంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు రసాయనాలు లేని, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందివ్వాలంటే ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులకు ఖర్చులు తగ్గడంతోపాటు లాభసాటిగా ఉంటుందని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో మెంటర్స్ జంగయ్య, బాబు, పావని, రామాంజనేయులు, నిరంజన్ రెడ్డి, శివశంకర్ రాజు, నాగరాజు, వెంకటరమణ, నీలావతి, శైలజ, చంద్రశేఖర్, వెంకటేష్, హరిప్రియ, జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

తెగుళ్లపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్న గురువలూరు, కుచ్చుపాప గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారి మ్యాగీ వరి రైతులకు తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిధిలో 13వేల ఎకరాలలో వరి పంట సాగైందన్నారు. అధికంగా వరి పంటలో ఆకు ముడత, ఎర్రనల్లి తెగుళ్ల సోకాయన్నారు. మందులు పిచికారి చేయడంతో వీటిని నివారించవచ్చని అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నా యన్నారు. వరి పంట చివరి దశలో పెసర, నువ్వు వంటి పంటలు సాగు చేసుకోవచ్చని రైతులకు సూచించారు. రబీ సీజన్‌లో సాగు చేసే పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో విఎఎ మాధవి లత, రైతులు పాల్గొన్నారు.



కుచ్చుపాపలో రైతులకు సూచనలిస్తున్న ఎఒ మ్యాగీ



భూమిపూజలో ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

అభివృద్ధి వైపు ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

కూటమి పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొత్తపల్లె పంచాయతీలో పనులకు ఎమ్మెల్యే, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి విఎస్ ముక్తియర్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి వాసవి సర్కిల్ వరకు ఫోర్‌లైన్ రహదారికి టెండర్లు పిలిచామన్నారు. త్వరగా పని మొదలుపెట్టి పూర్తి చేస్తామన్నారు. డిసిఎస్ఆర్ లాడ్జి నుండి రిలయన్స్ పెట్రోల్ బంక్ వరకు రూ.1కోటి 25 లక్షల వ్యయంతో మురుగు కాలువ, 100 అడుగుల రహదారి, డివైడర్ల పునరుద్ధరణకు భూమి పూజ చేశామన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం మొదలుపెట్టామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు రూ.25 కోట్ల తెప్పించామని తెలిపారు. కార్యక్రమంలో 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ గంగయ్య, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు బద్వేలి శ్రీనివాసులురెడ్డి, పీకాక్ బార్ సుబ్బారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొర్రపాడు విఆర్ఒగా మునిప్రసాద్

ప్రజాశక్తి - ముద్దనూరు



కొర్రపాడు గ్రామ విఆర్ఒగా ముని ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తొండూరు మండలం ఇనగలూరు గ్రామ విఆర్ఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ సచి వాలయ పరిధిలోని రైతులు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి అవసరమైన పత్రాలను అందరికి అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్‌కుమార్

ప్రజాశక్తి - ఖాజీపేట

జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పల్లవి, వర్షిణీ పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో.. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆ పాఠశాల ప్రిన్సిపల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్‌కుమార్ కోరారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు సురేంద్ర, వెంకీ పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్ర పటాలు అందజేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండల విద్యాశాఖ కార్యాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్ర పటాలను బుధవారం టిడిపి నేతలు అందజేశారు. ప్రభుత్వం మారి 5 నెలలు అయినా మాజీ సిఎం జగన్ ఫోటోనే ఎంఇఒ కార్యాలయంలో ఉండడాన్ని గమనించిన టిడిపి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలను సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు వేమా కుమార్, వీరభద్ర, రాజుల పవన్, యడాల జగదీష్, భాస్కర్, బాబా, ప్రశాంత్, వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం వద్దు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలపై వేసిన విద్యుత్ అదనపు భారం వద్దని సిపిఐ ఏరియా కార్యదర్శి వెంకట రాములు, సహయ కార్యదర్శి బ్రహ్మం, సురేష్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌టియు భవన్‌లో బుదవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలకు అదనపు భారం వేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీల భారం తగ్గిస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.17 వేల కోట్ల భారం ప్రజలపై మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. భారాన్ని తగ్గించకపోతే జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ధరలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి

- వరుని రూఫ్ టాప్‌బార్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వరుని రూఫ్ టాప్ బార్ ప్రజలకు ప్రయోజనకరమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. బుధవారం మైదుకూరు రోడ్డులోని కొవ్వూరు గ్రాండ్ 5వ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన వరుని రూఫ్ టాప్ బార్‌ను కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రూఫ్ టాప్ బార్‌లో ఫ్యామిలీ ఫంక్షన్‌లను ప్రజలకు అందుబాటు ధరలో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం యజమాని కొవ్వూరు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోనే మొదటి రూఫ్ టాప్ బార్‌ను తాము ఏర్పాటు చేశామన్నారు. కొవ్వూరు గ్రాండ్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశానని, ప్రస్తుతం త్రీ స్టార్ హోటల్‌గా అనుమతి వచ్చిందన్నారు. బర్త్ డే, మ్యారేజ్ డే ఫంక్షన్‌లకు ప్రొద్దుటూరు ప్రజలకు సరసమైన ధరలకే అందిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు సర్వీస్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో శివాలయం ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, టౌన్ ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు విఎస్ ముక్తియార్, ఇవి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో 14 గొర్రెలు మృతి

- రూ.రెండు లక్షల మేర నష్టం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని కల్లూరుపల్లె పంచాయతీ కాట్లగంట్ల గ్రామంలో విద్యుత్తు 11 కెవి వైర్లు తెగి 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల యజమాని సిద్ధ నరసింహప్ప నాయుడు వివరాల మేరకు.. బుధవారం ఉదయం 5 గంటలకు కాట్లగంట్లవారి పల్లె గ్రామ సమీపంలో గొర్లదొడ్డి పైన 11 కెవి విద్యుత్ వైర్లు తెగి గొర్రెల దొడ్డిలో ఉన్న గొర్రెలపై పడ్డాయి. గొర్రెల యజమాని హుటాహుటిన గొర్లదొడ్డిలోకి రావడంతో అతను కూడా కరెంటు షాక్ గురయ్యాడు. పక్కనే ఉన్న గ్రామస్తులు అతని ప్రాణాలు కాపాడారు. పశువుల డాక్టర్ మధుసూదనకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన సంఘటనాస్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. సంబంధిత అధికారులకు నివేదిక పంపామని డాక్టర్ పేర్కొన్నారు. తనకు జీవనాధారమైన గొర్రెలు చనిపోవడంతో ఆర్థికంగా చాలా దెబ్బతిన్నానని, తనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారని కుటుంబ పోషణకు జీవాలే దిక్కని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు నరసింహప్ప నాయుడు కోరుతున్నాడు.



చనిపోయిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి, బాధితుడు